
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 14 ఆగస్టు 2024





కాస్మొటిక్ చార్జీలూ కష్టమే..



హా స్టళ్లలో.. హాకారాలు

భోజనం సక్రమంగా అందదు.. తలకు నూనె లేదు.. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. లైటు కాలిపోతే మార్చే దిక్కులేదు.. మరుగుదొడ్ల నిర్వహణ లేదు.. ఇదీ ఉమ్మడి గుంటూరు పరిధిలోని హాస్టళ్లలో తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటోన్న విద్యార్థుల పరిస్థితి. ప్రభుత్వం నుంచి భోజన బిల్లులు విడుదల కాక.. వారికి సక్రమంగా ఆహారం అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. అయినా గత వైసీపీ పాలకులు.. ప్రస్తుత కూటమి పాలకులకు పట్టడంలేదు. పిల్లల ఆకలి కేకలు చూడలేక కొందరు సంక్షేమాధికారులైన హాస్టళ్ల నిర్వాహకులు అప్పులు చేసి ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. వారు కూడా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై నిర్లక్ష్యం చూపింది. దీంతో వసతిగృహాలు సమస్యల వలయంలో చిక్కుకుపోయాయి. ఇక విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మొటిక్ చార్జీలు, దుప్పట్లు, ఇతర సామగ్రి, చివరకు నోటు పుస్తకాలు వసతిగృహాలు ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా ఇంతవరకు వారికి అందలేదు. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలతో అల్లాడు తున్న విద్యార్థులకు గత కొన్ని నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణకు విడుదల కావాల్సిన కనీస నిధులు విషయంలోనూ ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శిస్తోంది.

- అర్ధాకలితో విద్యార్థుల అవస్థలు
- జనవరి నుంచి విడుదల కాని భోజన బిల్లులు
- వసతి గృహాల బిల్లుల బకాయి రూ.10 కోట్లు పైమాటే
- కాస్మొటిక్ చార్జీలు, దుప్పట్లు, సామగ్రి అంతే సంగతులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా సంక్షేమం సంక్షోభమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంటోంది. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. పేద విద్యార్థులపై కనికరం చూపడం లేదన్న విమర్శలు తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తోందన్న విమర్శలున్నాయి. పదో తరగతి లోపు, కళాశాల విద్యార్థులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పది వేలకుపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు ఉన్నాయి. జనవరి నుంచి భోజన బిల్లులు చెల్లించలేదు. రూ.10 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఎస్సీ, బీసీ, ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలకూ ప్రభుత్వం గండి కొడుతున్నది. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు సంబంధిత దుకాణదారులకు చెల్లించే వారు. వంద మంది విద్యార్థులు ఉన్న వసతిగృహానికి నెలకు రూ.1.40 లక్షలు భోజన బిల్లుగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆయా బిల్లులు విడుదల చేయకపోవడంతో సంక్షేమాధికారులు విద్యార్థుల ఆకలి తీర్చలేకపోతున్నారు. పైగా వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దుకాణాల్లో సరుకులు తేవాలని ప్రయత్నాలు చేస్తున్నా వారికి అప్పు పుట్టడంలేదు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో నిర్వహణ అధికారులు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపుల్లో ఇలానే జాప్యం జరిగితే విద్యార్థులు భోజనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రానున్నది. వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్‌లో ఉన్న ధరలకు పొంతన ఉండటంలేదు. దీంతో నిర్దేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.1,600 చెల్లిస్తోంది. వీరికి ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. పప్పులు, కూరగాయలు నూనె, గ్యాస్ అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. అయితే ఆ స్థాయిలో ప్రభుత్వం వసతి గృహాలకు బడ్జెట్ పెంచడంలేదు. దీంతో నిర్ధేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ప్రభుత్వం చెల్లించే ధరకు ఆహార పదార్థాలను అందించలేని పరిస్థితి. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని పాలకులు చెబుతున్నా ఆచరణలో ఎక్కడా కనిపించడంలేదు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం వసతి గృహాలలో భోజనానికి సంబంధించి మార్కెట్ కనుగుణంగా సరుకుల ధరలు పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది. అసలే అరకొరగా నిధులు కేటాయించినా వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఆహార పదార్థాలు సక్రమంగా అందడంలేదు.

బియ్యం కొనుగోలుకు చేయాల్సిందే..

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తి వేసింది. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యాన్ని వసతి గృహాలకు సరఫరా చేస్తారు. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో డీడీ అందజేసి బియ్యం వసతి గృహాలకు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహాల నిర్వహణ అధికారులు సొంతంగా నగదు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్ సిలెండర్ అప్పు లభించే పరిస్థితి లేదు. దీంతో దానిని కూడా నిర్వహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని వసతి గృహాలకు వాటి సరఫరా నిలిచిపోయింది.

కనీస వసతులకూ నిధులు లేవాయే

ఆహారం, కాస్మొటిక్ చార్జీలు, సామగ్రి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఎదో ఒకలా జరిగిపోతుంది. అయితే వసతి గృహాల నిర్వహణకు కూడా కొన్ని నెలలుగా నిధులు విడుదల కావడంలేదు. చివరకు హాస్టల్‌లో కరెంటు బల్బు మాడిపోయినా దానిని మార్చాలన్నా వార్డెన్లు వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, ఇతర మరమ్మతులకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదని వార్డెన్లు వాపోతున్నారు. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లి దండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను నెలవారీగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆ చార్జీలు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడం లేదు. కాస్మొటిక్ చార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున చెల్లించాలి. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ చార్జీ అదనంగా విడుదల చేయాలి. అయితే ఇవేవీ ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. ఇది వారికి భారంగా మారుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు కొంత సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేయాలి. అయితే వసతి గృహాలు తెరిచి రెండు నెలలు గడిచినా నేటి వరకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్, గ్లాసు, ట్రంక్ పెట్టె తదితర సామగ్రిని నేటి వరకు విద్యార్థులకు అందజేయలేదు.

నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం



ఎంపీడీవోలు వచ్చేశారు

- 30 మండలాలకు నియామకం
- గుంటూరు జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ

నరసరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 30 మండలాలకు ఎంపీడీవోలను నియమించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం, కృష్ణాజిల్లాకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపీడీవోలను బదిలీ చేసిన విషయం తెలిసిందే. వీరందరిని తిరిగి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండలాలకు నియమించారు. మండలాల వారీగా ఎంపీడీవోల వివరాలు..

పేరు	మండలం	జిల్లా
పీ ఉమాదేవి	అమరావతి	పల్నాడు
ఎన్ వెంకటేశ్వరరావు	నరసరావుపేట	పల్నాడు
పీ శివసుబ్రమణ్యం	అచ్చంపేట	పల్నాడు
షేక్ గౌసీయాబేగం	బొల్లాపల్లి	పల్నాడు
కే సమతావాణి	దుర్గి	పల్నాడు
వై హనుమరెడ్డి	యడ్లపాడు	పల్నాడు
ఆర్‌ఈవీ ఫణికుమార్	గురజాల	పల్నాడు
బీ మహేష్‌బాబు	క్రోసూరు	పల్నాడు
పీ పుట్టారెడ్డి	ముప్పాళ్ల	పల్నాడు
బీ శ్రీనివాసరెడ్డి	నకరికల్లు	పల్నాడు
కే నరసింహారావు	పెదకూరపాడు	పల్నాడు
జీ కాశయ్య	పిడుగురాళ్ల	పల్నాడు
కే మాథ్యూబాబు	రొంపిచర్ల	పల్నాడు
జీ సత్యనారాయణ	సత్తెనపల్లి	పల్నాడు
పీ సీతారామయ్య	శావల్యాపురం	పల్నాడు
ఎం శ్రీదేవి	వెల్దుర్తి	పల్నాడు
ఎం శోభారాణి	దాచేపల్లి	పల్నాడు
వై మహాలక్ష్మి	రెంటచింతల	పల్నాడు
టీ సుగుణమ్మ	చుండూరు	బాపట్ల
షేక్ మహబూబ్‌సుభాని	అమృతలూరు	బాపట్ల
ఐ సత్యనారాయణ	కొల్లూరు	బాపట్ల
జీ చంద్రశేఖరరావు	భట్టిప్రోలు	బాపట్ల
కే నాగలక్ష్మి	నిజాంపట్నం	బాపట్ల
బీ మారుతీశేషమాంబ	పిట్టనివానిపాలెం	బాపట్ల
కే శివపార్వతి	రేపల్లె	బాపట్ల
ఏ దీప్తి	తాడికొండ	గుంటూరు
ఏ శ్రీనివాసరావు	పొన్నూరు	గుంటూరు
బీ బాబురావు	చేబ్రోలు	గుంటూరు
పీజే విలియమ్స్	మంగళగిరి	గుంటూరు
వీ విజయలక్ష్మి	కొల్లిపర	గుంటూరు

బాధితులకు లోకేశ్ భరోసా

- ప్రజాదర్బార్ 25వ రోజు వినతుల వెల్లువ



సమస్య పరిష్కరించాలని మంత్రి లోకేశ్‌కు అర్జీ అందిస్తున్న పీజీ విద్యార్థులు

6లో..



రెండో రైలు మార్గానికి సిద్ధం

- గుంటూరు - బీబీనగర్ మార్గంలో భూసేకరణ
- ఆరు గ్రామాల్లో 47.785 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్
- కాంపిటెంట్ అథారిటీగా గుంటూరు ఆర్డీవో.. నెల పాటు అభ్యంతరాలకు అవకాశం

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రెండో రైలుమార్గం నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రైల్వే శాఖ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు గుంటూరు పశ్చిమ, తాడికొండ, మేడికొండూరు మండలాల పరిధిలో భూసేకరణని రెవెన్యూ శాఖ చేపట్టేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా మండలాల్లోని గ్రామాల పేర్లు, సర్వే నెంబర్లలో ఎంత విస్తీర్ణం భూమిని సేకరించదలిచారో పేర్కొంటూ షెడ్యూల్‌ని విడుదల చేశారు. మొత్తం ఆరు గ్రామాల్లో 47.785 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందుకోసం కాంపిటెంట్ అథారిటీగా గుంటూరు ఆర్డీవో శ్రీకర్ వ్యవహరిస్తారు. భూసేకరణ విషయంలో ఎలాంటి అభ్యంతరాలున్నా 30 రోజుల వ్యవధిలో తమకు నివేదించాలని ఆయన సూచించారు.

క్రాసింగ్ సమస్యకు చెక్..

గుంటూరు - సికింద్రాబాద్ వయా నడికుడి మార్గం ప్రస్తుతం సింగిల్ లేన్‌గా ఉన్నది. దీనిపై ఇప్పటికే 100 శాతం లైన్ కెపాసిటీ మేరకు రైళ్లు/గూడ్స్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో క్రాసింగ్ సమస్య కూడా ఉత్పన్నమౌతున్నది. ఏ కారణం చేతనైనా కాజీపేట మార్గంలో సమస్య తలెత్తితే చాలా రైళ్లు నడికుడి మార్గంలో మళ్లిస్తున్నారు. ఇది ఈ మార్గాన్ని మరింత రద్దీగా మార్చేస్తున్నది. దీంతో ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకు రైల్వే శాఖ రెండేళ్ల క్రితమే పచ్చజెండా ఊపింది. ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. 248 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ఈ రెండో మార్గాన్ని అంబరెల్లా వర్కు కింద చేపట్టాలని నిర్ణయించింది. ప్రాజెక్టు ఖర్చు రూ.2,853.23 కోట్లుగా అంచనా వేసి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించింది. దీంతో భూసేకరణ ప్రక్రియని రైల్వే శాఖ ప్రారంభించింది. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలోని సిరిపురం గ్రామంలో 30 సర్వే నెంబర్లలో 15.809 ఎకరాలు, మందపాడులో 13 సర్వే నెంబర్లలో 7.35 ఎకరాలు, విశదలలో ఒక సర్వే నెంబరులో 0.106 ఎకరాలు సేకరించనున్నారు. తాడికొండ మండలంలోని బండారుపల్లి గ్రామంలో 31 సర్వే నెంబర్లలో 9.099 ఎకరాలు, గుంటూరు పశ్చిమ మండలంలోని చినపలకలూరులో 9.463 ఎకరాలు, నల్లపాడు పరిధిలో 22 సర్వే నెంబర్లలో 5.958 ఎకరాల భూమిని సేకరించనున్నారు. సర్వే నెంబర్ల వివరాలతో గజిట్ నోటిఫికేషన్‌ని గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. అలానే స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. ఈ భూసేకరణపై వచ్చే నెల 10 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఆ తర్వాత తదుపరి ప్రక్రియని చేపడతారు. ఇదేవిధంగా పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు, సత్తెనపల్లి, రాజుపాలెం, బెల్లంకొండ, పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లోనూ భూసేకరణ ప్రక్రియని అక్కడి ఆర్డీవో చేపడతారు. భూసేకరణ ప్రక్రియని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైల్వేకి అవసరమైన భూమిని స్వాధీనపరిచేందుకు రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టింది.

ఒకే పేరుతో పదేపదే ఇసుక లోడింగ్

- మున్నంగి యార్డు తనిఖీలో గుర్తించిన కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర/గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు తిరిగి అమ్మకాలు చేసేవారి వాహనాలు సీజ్ చేయడంతో పాటు భారీగా అపరాధ రుసుం విధిస్తామని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం కొల్లిపర మండలంలోని మున్నంగి ఇసుక స్టాక్‌యార్డును తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్‌తో కలెక్టర్ కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ యార్డు వద్ద నగదు వసూలు చేస్తున్న సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. పేమెంట్ చెల్లించిన తర్వాత ఇసుక లోడుకు రశీదులు అందించే స్వయం సహాయక సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రశీదు పుస్తకాలు పరిశీలన సందర్భంగా ఎక్కువ రసీదులలో వినియోగదారుడు, ఇసుక సరఫరా చేసే వాహనదారుడి ఫోన్ నెంబర్లు ఒకటే ఉండటం గుర్తించి సిబ్బందిని ప్రశ్నించారు. ఇక నుంచి ఖచ్చితంగా వినియోగదారుల ఫోన్ నెంబర్ నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రశీదులో వినియోగదారుల పూర్తి వివరాలు నమోదు చేయాలని అవసరమైతే వాహనదారులు తెచ్చిన వినియోగదారుడికి ఫోన్‌చేసి చెక్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి రూరల్ సీఐ బెల్లం కొండ శ్రీనివాసరావు, కొల్లిపర తహసీల్దారు సిద్ధార్థ, ఆర్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో ఇసుక స్టాక్‌యార్డులో బిల్లులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



దివ్యాంగుల సమస్యలు వింటున్న మంత్రి లోకేశ్

బాధితులకు లోకేశ్ భరోసా

● ప్రజాదర్బార్ 25వ రోజు వినతుల వెల్లువ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 13: ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం 25వ రోజు జరిగిన ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రి లోకేశ్‌ను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తి పరిశీలించిన మంత్రి సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలోని జామాయిల్‌తోట ప్రాంతంలో 300 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణంతోపాటు డ్రైనేజి సదుపాయం కల్పించాలని పి.సంపత్‌కుమార్ నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన తిరువీధుల నాగశ్రావణి కోరారు. రోడ్డు ప్రమాదంలో తమ కుమారుడు మృతిచెందాడని ప్రమాదబీమా చెల్లింపుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని దుగ్గిరాలకు చెందిన ఎస్ దుర్గామల్లేశ్వరి విజ్ఞప్తి చేశారు. బ్రెయిన్‌ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించడంతోపాటు పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన మహ్మద్ అబ్దుల్ ముజీబ్ విజ్ఞప్తి చేశారు. అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్న తనకు ఎలాంటి ఆధారం లేదని ఇల్లు మంజూరు చేయాలని పోలకంపాడుకు చెందిన మోక నారాయణమ్మ కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి అండగా ఉంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ సమయంలో షామియానాలు, డ్రింకింగ్ వాటర్ సరఫరా చేసిన తనకు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని బిల్లుల మంజూరుకు ఆదేశాలు ఇవ్వాలని సిరిపల్లి నారాయణమూర్తి కోరారు. బాపట్ల జిల్లా, పర్చూరులోని బీఏఆర్ అండ్ టీవీ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు అవసరమైన జీవో జారీచేయాలని సిబ్బంది కోరారు. విజయవాడ సిద్దార్థ వైద్యకళాశాలలో అనాటమీ విభాగానికి చెందిన హెచ్‌వోడీ డాక్టర్ చిత్ర వేధింపులకు గురి చేస్తున్నారని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పీజీ విద్యార్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. తీవ్ర అనారోగ్యం బారినపడి చికిత్స పొందిన తనకు వైద్యఖర్చులు రూ.8లక్షల వరకు అయ్యాయని, సీఎంఆర్ఎఫ్ కింద ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన మొగిలి శాంతి విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో రాజబొమ్మంతిలోని తన 10 ఎకరాల పొలం, ఇంటి స్థలాన్ని గత ప్రభుత్వం అండతో కబ్జా చేశారని విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని రాపర్తి మాణిక్యాలరావు కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరుచేయాలని గుంటూరుకు చెందిన కె.ప్రశాంతి కోరారు. ప్రకాశం జిల్లా నాగిరెడ్డిపాలెంలో వంశపారంపర్యంగా వచ్చిన తన 1.12 ఎకరాల భూమిని గత ప్రభుత్వ అండతో కబ్జా చేశారని, తగిన న్యాయం చేయాలని గుమ్మళ్ల బ్రహ్మయ్య కోరారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో 22 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్ల పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా, మార్కాపురం మండలం అయినముక్కల గ్రామంలో 11మంది కలిసి కొనుగోలు చేసిన 78.71 ఎకరాలను గత ప్రభుత్వ అండతో వైకాపా నాయకులు కబ్జా చేశారని, విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా ఓబులేసుని పల్లెకు చెందిన మాగులూరి నారయ్య కోరారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో తిరిగి చేర్చేందుకు చర్యలు చేపట్టాలని బుడగ జంగం సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వ్యవసాయ మార్కెట్‌లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేసిన తమను గత ప్రభుత్వం తొలగించిందని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిబ్బంది కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

గురజాల జీడీసీసీబీ కుంభకోణంపై రికార్డుల పరిశీలన

పిడుగురాళ్ల, ఆగస్టు 13: గురజాలలోని జీడీసీసీ బ్యాంక్‌లో రెండు రోజులుగా ఆప్కాబ్, సహకార సంఘ అధికారులు సంయుక్తంగా రికార్డులను పరిశీలించారు. సుమారు 150 మంది రైతుల పేర్లతో రూ.6కోట్ల రుణాలు పొందిన వ్యవహారంపై అన్ని కోణాలలో పరిశీలించారు. మిర్చి నిల్వవుంచిన కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించారు. మొత్తం మీద ఆప్కాబ్, సహకార సంఘ అధికారుల పరిశీలనలో మిర్చి నిల్వలు లేకుండానే రుణాలు మంజూరు చేసినట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి తగు నివేదిక పంపేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు.

సురక్షిత తాగునీరందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యం

● దేచవరం జలజీవన్ మిషన్ అమలు తీరు భేష్

● కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్

నకరికల్లు, ఆగస్టు 13: ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరును అందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యమని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్ అన్నారు. మంగళవారం నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో అమృత్ సరోవర్ ట్యాంక్‌ను పరిశీలించారు. దేచవరంలో జలజీవన్ మిషన్ నిర్వహణ తీరు చక్కగా ఉందని ఆయన అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా జరిగిన అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. 2019లో ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించారని, 2024 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాలతో సకాలంలో పనులు పూర్తికాకపోవటంతో 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఆర్ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి 55 లీటర్లు క్లోరినేషన్ చేసిన సురక్షిత తాగునీరందించేలా పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. 0.2 పీపీఎం ఉండేలా పరీక్షలు నిర్వహించి ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. దేచవరంలో నిర్మించిన జలజీవన్ మిషన్ అంచనా వ్యయం రూ 76 లక్షలు కాగా పైపులైన్, వాటర్ ట్యాపుల కోసం రూ 55లక్షల వరకు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఎంపీ నిధులు రూ 10లక్షల వరకు కేటాయించినట్టు తెలిపారు. గ్రామంలో మొత్తం 1265 ట్యాప్ కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉందన్నారు. కాగా గ్రామ ప్రజలు నూతనంగా ఏర్పాటైన బీసీ కాలనీకి, ఎస్సీ కాలనీకి ఈ పథకం వర్తింపచేయాలని అధికారుల దృష్టికి తెచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఓహెచ్ఆర్ కోసం, చెరువు కట్ట బలోపేతం కోసం రూ 70లక్షలు వరకు నిధులు కేటాయించాలని మాజీ జడ్పీటీసీ భవనం రాఘవరెడ్డి అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ కే రత్నబాబు, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్లు తేజ్ సంగీత్, రంగారావు, డ్వామా పీడీ గంగవరపు జోసెఫ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నర్రా మమత, సర్పంచ్ నామేపల్లి ఆదిలక్ష్మి, బోడపాటి వెంకటరావు, దొండేటి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమృత్ సరోవర్ ట్యాంక్ రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్

ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేతతో విద్యుత్‌శాఖకు షాక్

● చెల్లింపుల్లో డిస్కం పరిధిలో రూ.కోట్లలోనే వ్యత్యాసం..

● తిరిగి ఫోన్‌పే చెల్లింపులకు అవకాశం.. త్వరలో గూగుల్ పేలో కూడా..

గుంటూరు, ఆగస్టు 13: విద్యుత్‌బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపులకు వినియోగదారులను ప్రోత్సహించిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఇటీవల ఆ చెల్లింపులు నిలిపివేయటంతో ఊహించని షాక్ తగిలింది. నెల రోజుల వ్యత్యాసంలోనే బిల్లుల చెల్లింపులు భారీగా తగ్గిపోవటంతో ఆ శాఖ అధికారులను ఖంగు తినిపించింది. దాంతో తిరిగా ఉన్నతాధికారులు ఫోన్‌పే చెల్లింపులు తిరిగి పునరుద్ధరించినట్లు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు విద్యుత్‌పంపిణీ సంస్థ ఏపీసీపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్‌తో పాటు ఫోన్ పేతో కూడా ఇకపై చెల్లింపులు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సాధారణంగా విద్యుత్‌రెవెన్యూ కార్యాలయాలకు వచ్చి క్యూలలో వేచి ఉండటం వంటి వ్యయప్రయాసలు లేకుండా ప్రత్యామ్నాయ చెల్లింపులకు వినియోగదారులను ప్రోత్సహించారు. ఆన్‌లైన్ చెల్లింపులతో పాటు స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం పెరిగాక ఫోన్‌ల నుంచే బిల్లుల చెల్లింపు జరుపుకునేలా ఫోన్ పే, గూగుల్ పేలను ప్రోత్సహిస్తూ వినియోగదారులకు అవగాహన కూడా కల్పించారు. తద్వారా బిల్లుల చెల్లింపు ఎంతో సులభతరంగా మారింది. విద్యుత్‌శాఖకు కూడా సకాలంలో బిల్లుల బకాయిలు ఖజానాకు వచ్చి చేరాయి. కొన్ని సాంకేతిక కారణాలతో గత నెలాఖరున ఫోన్‌పే, గూగుల్‌పే చెల్లింపులు చెల్లవని ప్రకటించారు. దాంతో వినియోగదారుల్లో తీవ్ర గందరగోళం వ్యక్తమైంది. ఇప్పటి వరకు ఫోన్ పే, గూగుల్ పేల సాయంతో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అలవాటుపడిన వినియోగదారులు ఏపీసీపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులు తెలియక విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలకు పెద్దఎత్తున చేరుకున్నారు. దాంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, చెల్లింపు కేంద్రాల వద్ద చాంతాడంత క్యూ కనిపించింది. నల్లచెరువు ఈఆర్‌వో కార్యాలయం ఎదుట రెండు కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ వినియోగదారుల రద్దీ తగ్గని పరిస్థితి నెలకొన్నది. అయితే ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేత సాంకేతిక కారణాలతోనే జరిగిందని ఇందులో ఎవరి ప్రమేయం లేదని చెబుతున్నారు.

సీపీడీసీఎల్ పరిధిలో రూ.కోట్లలోనే తేడా....

ఫోన్ పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేతతో సీపీడీసీఎల్ పరిధిలో రూ.కోట్లలోనే చెల్లింపుల బకాయిలు నిలిచిపోయినట్లు సమాచారం. సీపీడీసీఎల్ పరిధిలోని విజయవాడ, సీఆర్‌డీఏ, గుంటూరు, ఒంగోలు సర్కిల్స్ పరిధిలోని మొత్తం బకాయిలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయని ఆ శాఖ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇలా అయితే పరిస్థితి తారుమారయ్యే ప్రమాదముందని ఉన్నతాధికారులు పునరాలోచనలో పడ్డారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల జోక్యంతో ఫోన్ పేతో కూడా చెల్లింపులు పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో గూగుల్‌పేతో కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపులు అందుబాటులో రానున్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ

● 0.35 ఎంయూల విద్యుత్ తయారీ: ఎస్ఈ వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 13: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 7.08 టీఎంసీలు కాగా మంగళవారం రాత్రి వరకు 7 టీఎంసీల నీటిని నిల్వ వుంచినట్లు ఎస్ఈ కొలేగుండ్ల వెంకటరమణ చెప్పారు. ఎగువన వున్న సాగర్ నుంచి 29,800 క్యూసెక్కుల నీరు వస్తుండగా ప్రాజెక్టు నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టుకు చెందిన 2 గేట్లు 1.5 మీటర్లు, మరో 2 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 22 వేలు, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నామన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.35 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 18 వేల క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 16వేల క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 13: ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజి వద్ద చేరుతుండటంతో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 28 వేలు, కీసర వాగు నుండి 6వేల క్యూసెక్కుల వంతున మొత్తం 34 వేల క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 18వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 11: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం మంగళవారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,347 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,30,347 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఎన్టీఆర్ బస్టాండ్‌లో పోస్టల్ పార్శిల్ బుకింగ్ సౌకర్యం

గుంటూరు, ఆగస్టు 13: ప్రజల సౌకర్యం కోసం గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లో 24 గంటలు పోస్టల్ బుకింగ్ సౌకర్యం సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు ఆర్ఎంఎస్ సూపరింటెండెంట్ జీవీ బాల సరస్వతి తెలిపారు. దేశంలో ఏ మారుమూల గ్రామానికైనా, ముఖ్యంగా రిజిస్టర్డ్ పార్శిల్స్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు గుంటూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ (9959126452)ను సంప్రదించాలని కోరారు. ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బస్టాండ్‌లో పోస్టల్ పార్శిల్ బుకింగ్‌ను ప్రారంభించిన ఆర్ఎంఎస్ సూపరింటెండెంట్ బాలసరస్వతి తదితరులు

జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉండాలి

● రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 13: మద్యం ప్రియులకు జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉండాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నల్లపాడులోని ఐ.ఎం.ఎల్ డిపో, మద్యం దుకాణంలో తనిఖీలు చేశారు. డిపోలోని ఇండెంట్ వ్యవస్థ పనితీరు, ఆ వ్యవస్థ విధివిధానాలు, షాపుల నుండి ఇండెంట్ ఎలా పెడతారు, ఆ ఇండెంట్‌ని బట్టి స్టాక్‌ని డిపో నుండి ఎలా పంపిణీ చేస్తారన్న వివరాలను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అదేవిధంగా నల్లపాడులోని ఒక మద్యం దుకాణాన్ని సందర్శించి అక్కడ సిబ్బందిని ఏపే పనులు చేస్తారని, ఇండెంట్ ఎలా పెడతారని, ఏపే బ్రాండ్లు ఎక్కువ అమ్ముడుపోతున్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జి రావు, అబ్కారీ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ వెంకట్రామిరెడ్డి, అబ్కారీ సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నల్లపాడు ఐఎంఎల్ డిపోలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎక్సైజ్ రాష్ట్ర కమిషనర్ నిశాంత్‌కుమార్, పక్కన డీసీ బాబ్జీరావ్

పిడుగు పాటుకు వృద్ధుడి మృతి

చిలకలూరిపేట, ఆగస్టు 13: చిలకలూరిపేట రూరల్ మండలంలోని పసుమర్రు గ్రామంలో పిడుగుపాటుకు తన్నీరు నరసింహారావు(78) మృతి చెందాడు. గ్రామంలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో నివాసం ఉంటున్న నరసింహారావు స్నానం చేస్తుండగా సమీపంలోనే పిడుగు పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.

అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

● గుంటూరు జిల్లాలో 14 చోట్ల ఏర్పాటు

● లాంఛనంగా ప్రారంభించనున్న ప్రొటోకాల్ మంత్రి నారా లోకేశ్

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లు తిరిగి తెరుచుకోబోతున్నాయి. 2019 జూన్ నెల ముందువరకు మూడు పూటల పేదల కడుపు నింపి భోజనాలయాలుగా పేరుగాంచిన ఈ అన్న క్యాంటీన్‌లను వైసీపీ ప్రభుత్వం అప్పట్లో అధికారంలోకి వస్తూనే మూసేసింది. ఆ తర్వాత వాటిని పట్టించుకోకుండా శిథిలావస్థకి చేర్చింది. అన్న క్యాంటీన్‌లు ఏ పాపం చేశాయని అటు ప్రతిపక్షాలు ఇటు ప్రజలు ప్రశ్నించినా వైసీపీ నేతల కర్కశ మనసులు కరగలేదు. తెలుగుదేశం పార్టీ తరుపున దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలను కూడా అడ్డుకోనేందుకు అధికారాన్ని ఉపయోగించింది. అయినప్పటికీ చాలాచోట్ల అన్న క్యాంటీన్‌లను తాత్కాలిక ప్రదేశాల్లో తెలుగుదేశం పార్టీ నిర్వహించి పేదల ఆకలి తీరుస్తూ వచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు మాట ఇచ్చారు. ఆ మేరకు ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లాలో 14 చోట్ల అన్న క్యాంటీన్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

జిల్లాలో అమరావతి రోడ్డులోని ఐడీ హాస్పిటల్, స్వర్ణభారతీనగర్ సమీపంలోని డీటీసీ ఆఫీసు, మిర్చియార్డు, నల్లచెరువు వాటర్ ట్యాంకు, పల్నాడు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ రైతుబజార్, చుట్టుగుంట సమీపంలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత ఆర్టీసీ బస్టాండ్, నులకపేట, ఉండవల్లి, పొన్నూరులోని సుబ్బరాయసత్రం, తెనాలిలోని మునిసిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్, మార్కెట్‌యార్డు, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల వద్ద అన్న క్యాంటీన్‌లను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయా మునిసిపల్ కార్పొరేషన్‌లు, పురపాలక సంఘాలు పనులు చేపట్టాయి. అల్యూమినియం క్లాడింగ్ ఫినిషింగ్‌తో కొత్త లుక్‌ని తీసుకొచ్చాయి. ఒక్కో క్యాంటీన్‌లో సదుపాయాల కల్పనకు దాదాపుగా రూ.9లక్షల వరకు నిధులు వినియోగిస్తున్నట్లు మునిసిపల్ వర్గాలు తెలిపాయి. వీటిని గురువారం జిల్లా కేంద్రంలో మంత్రి నారా లోకేశ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. నిత్యం ఒక్కోపూట మూడువందల మందికి పైగా పేదలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కేవలం రూ.5కే రుచికరంగా వడ్డించనున్నారు.

తెనాలిలో 250 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన

తెనాలి అర్బన్, ఆగస్టు 13: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం 250 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని ఊరేగించారు. పట్టణంలోని పలు రహదారుల గుండా ర్యాలీ చేసి జాతి సమైక్యతను దేశ సమగ్రతను కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రముఖ్ అవ్వారు శ్రీనివాసరావు, ఏబీవీపీ గౌరవ అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశభక్తి, క్రమశిక్షణ ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని, దేశం పట్ల విధేయత లేని వారికి దేశంలో ఉండే అర్హత లేదన్నారు. 500మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొంటూ జైభారత్ నినాదాలతో హోరెత్తించారు. పర్యావరణ కార్యదర్శి శేషు, పవన్ కుమార్, లోకేష్‌చంద్ర, హేమంతరామ్ పాల్గొన్నారు.



250 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బాపట్లలో రెండు రాష్ట్రాల వేదసదస్సు



రెండు రాష్ట్రాల వేదసదస్సులో పండితులు, వేద విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 13: విశ్వాన్ని నడిపించగల మహత్తరమైన సంకల్పం సర్వజగత్తును నడిపించగల శక్తి ఒక్క వేదనాదానికి ఉందని మహర్షుల భావన అని, అటువంటి వేదనాద వ్యాప్తికి ప్రతి ఒక్కరు కృషిచేయాల్సిన అవసరం ఉందని పలువురు పండితులు అభిప్రాయపడ్డారు. శ్రీశంకర విద్యాలయ వ్యవస్థాపకులు శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి 145వ జయంతి ఉత్సవాలలో భాగంగా బాపట్లలోని శ్రీశంకర విద్యాలయంలోని వేదపాఠశాలలో మూడురోజులపాటు జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల వేదసదస్సులో అనేకమంది పండితులు పాల్గొని ప్రవచనాలు చేశారు. 40మంది వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సుకు కపిలవాయి రామశాస్త్రి అధ్యక్షత వహించగా గుళ్ళపల్లి చినఆంజనేయ ఘనాపాటి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు పర్యవేక్షకులుగా వ్యవహరిచారు. వేదనాదాలతో ప్రతిధ్వనించే ఏ క్షేత్రంలోనైనా దేవతలు కొలువై ఉంటారన్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యుత్తమ వైదిక సంస్కృతి, ఆధ్యాత్మికత విద్య, విజ్ఞాన విద్యావ్యాప్తికి ప్రబోధ ప్రచారాల ద్వారా నాటి మహాతపస్వి పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మానంద తీర్థస్వామి తెలుగు రాష్ట్రాలలో విశేషంగా కృషిచేశారని కొనియాడారు. కొన్నివేలమంది పండితులుగా తయారుకావటానికి ఈ పాఠశాలలు అందించిన విద్యాబోధన ఉపకరించిందన్నారు. కార్యక్రమంలో శ్రీశంకర విద్యాలయ వేదపాఠశాల నిర్వాహకులు శిఖరం భుజగేంద్ర మౌళి, చలపతిరావు, బి.బాబునాగేంద్ర, పండితులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరునెలల జైలు

మంగళగిరి, ఆగస్టు 13: చెల్లనిచెక్కు కేసులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.6లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే సురేష్‌బాబు మంగళవారం తీర్పును వెలువరించారు. మంగళగిరికి చెందిన కొదమల కుమార్ అనే వ్యక్తి నుంచి ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జంగా పద్మజ రూ.పది లక్షలను అప్పుగా తీసుకుని పార్ట్‌పేమెంట్ కింద 2019లో రూ.ఆరులక్షల చెక్కును ఇచ్చింది. ఈ చెక్కును కెనరా బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. ఈ మేరకు బాధితుడు కుమార్ మంగళగిరి కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేయగా వాదోపవాదాల అనంతరం న్యాయమూర్తి కే సురేష్ బాబు వైద్యురాలు పద్మజకు ఆరు నెలలపాటు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ ఆరు లక్షలను నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశాలను ఇచ్చారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.86 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

52,954 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 55,002 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 52,954 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 23,296 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000	334	8000	15500
నెంబరు. 5	8500	12000	నెంబరు. 5	12000	12000
273	9000	12500	273	–	–
341	9000	15500	341	9000	15000
4884	–	–	4884	8500	14000
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18700	తేజ	8500	18500
బ్యాడిగి	8500	16500	బ్యాడిగి	9500	14500
దేవనూరుడీలక్స్	9500	15500	దేవనూరుడీలక్స్	9000	13200
తెల్లకాయలు	4500	10500	తెల్లకాయలు	4500	10000

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

రోడ్ల నిర్మాణంలో ఎఫ్‌డీఆర్ పద్ధతిని అనుసరించండి

● కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణంలో తాజా సాంకేతిక పద్ధతులు వినియోగించాలని, తక్కువ సహజ వనరుల వినియోగంతో స్థానిక భౌతిక పదార్థాలను పునర్వినియోగించే ఫుల్ డెప్త్ రీక్లమేషన్(ఎఫ్‌డీఆర్) పద్ధతిని అనుసరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌ఐఆర్‌డీ క్యాంపస్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. రోడ్లు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో కొత్త సాంకేతికతను అనుసంధానం చేయడంపై ఆయన చర్చించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సమర్థవంతంగా ఉపయోగించి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

త్వరలో ప్రపంచంలోనే అగ్రగామిగా భారతదేశం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారత దేశం ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా అతి త్వరలో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. హిందూ కాలేజి కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ మంగళవారం జరిగిన హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధన, చంద్రుడిపై పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ఇప్పటికే అగ్రగామి దేశంగా వుందని, క్రీడలు, ఆర్థిక వనరులు, ఉద్యోగ కల్పనలో మరింత మెరుగుపడాలని నసీర్ అభిప్రాయపడ్డారు. మోదీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దేశాన్ని గత పదేళ్లుగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లిందని, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని అన్నారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, రంగరాజు, పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న నసీర్, నరేంద్ర తదితరులు

ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(విద్య),ఆగస్టు 13: ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తూర్పు ఎమ్మెల్యే నసీర్‌కు సంఘం నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. సర్దుబాటు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఏరాష్ట్ర అధ్యక్షులు షేక్ కలీం, ఉర్దూ డిఐ ఎస్‌కె ఎండీ ఖాసిం, షబ్బీర్, సయ్యద్ ఇషాక్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటా



సోయబ్‌ను పరామర్శిస్తున్న నసీర్

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పార్టీకి ప్రాణమైన కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గుంటూరులోని సాయి బాలాజీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఆనందపేటకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త షేక్ సోయబ్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధి ద్వారా చికిత్సకు అవసరమయ్యే సహాయాన్ని మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జమీర్, ఉస్మాన్, మధురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శారద కాలనీకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13: శారదా కాలనీలో నివాసముంటున్న 1200 కుటుంబాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ తూర్పు ఎమ్మెల్యే నసీర్‌కు సీపీఐ ఆధ్వర్యంలో స్థానికులు వినతి పత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా కృషి చేస్తానని నసీర్ వారికి హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎం.లక్ష్మయ్య, కే సుబ్బయ్య, సీహెచ్ వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, దుర్గయ్య, తిరుమలరెడ్డి, సుందరరావు తదితరులు ఉన్నారు.

నేడు కమిషనర్ పులి శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 13 : గుంటూరు నగరపాలక సంస్థ 29వ నూతన కమిషనర్‌గా పులి శ్రీనివాసులు బుధవారం ఉదయం 9:30కి బాధ్యతలు చేపట్టనున్నారు. శ్రీనివాసులు ఉద్యోగ బాధ్యతలు స్వీకరణకు అధికారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయన చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

108 కేజీల పసుపుతో అభిషేకార్చన



పసుపుతో అభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

గుంటూరు (తూర్పు), ఆగస్టు 13: స్థానిక అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు ఆధ్వర్యంలో శ్రావణ మాస కోటి కుంకుమార్చన మహోత్సవాలలో భాగంగా రెండవ మంగళవారం ఉదయం స్వామి వారికి విశేష అభిషేకార్చనలు జరిగాయి. అనంతరం ఆదిలక్ష్మి అమ్మవారికి 108 కేజీల పసుపుతో విశేష అభిషేకార్చన మహిళా భక్తులతో వేదమంత్రాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశేష హారతులు, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణ జరిగింది.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13 : స్థానిక సిద్ధార్థనగర్ శ్రీ కనకమహాలక్ష్మి మందిరంలో శ్రావణమాస పూజల సందర్భంగా మంగళవారం అమ్మవారిని మంగళ గౌరిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో వేదమంత్రాల నడుమ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా పాల్గొన్న సువాసినులచే మంగళగౌరి వ్రతాలను నిర్వహిస్తూ గౌరీవ్రత విశేషాలను వేదపండితులు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను అందుకున్నారు. కార్యక్రమాలను ఘంటసాల విజయస్వామి పర్యవేక్షించారు.

హిందూ కళాశాలలో ముగిసిన అంతర కళాశాల పోటీలు

గుంటూరు(విద్య),ఆగస్టు 13: స్థానిక హిందూ కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాల పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. యువజన సంక్షేమ శాఖ, కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 30 కళాశాలల నుంచి 480 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాల పోటీలు, బృందనాట్యం పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, పివి రాము, పూర్వ విద్యార్థి పి.అనిల్‌కుమార్, ప్రిన్సిపల్ పిఎం దుర్గాప్రసాద్, స్టెప్ అధికారులు రాధిక, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి రామచంద్రరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి వేణుగోపాల్, డాక్టర్ కె.కాళిదాస్, డాక్టర్ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో విజేతలు వీరే

గుంటూరు(విద్య), ఆగస్టు 13: జీవ వైవిధ్య సంరక్షణలో యువత పాత్ర అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ బయో డైవర్శిటీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. పాత బస్టాండు సమీపంలోని పరీక్షాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఈవో పి.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. వ్యాసరచనలో లిఖిత(జడ్పీ స్కూల్ అంకిరెడ్డిపాలెం), తులసీ(నారాకోడూరు), రిషిత(కంతేరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా డ్రాయింగ్ పోటీల్లో ఆఫ్తాబ్ ఆలీ(ఎస్‌కేబీపీఎం మున్సిపల్ స్కూల్, వేణుగోపాలనగర్), హాఫీజ్(కొత్తపేట మున్సిపల్ స్కూల్), షాలిని(ఎస్ఎస్ఎన్‌వో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు) తొలి మూడుస్థానాలు కైవసం చేసుకున్నారు. ఇంకా వక్తృత్వ పోటీల్లో ఉమిక(జడ్పీస్కూల్, అబ్బినేనిగుంటవారిపాలెం), కావ్య(పెదపాలెం హైస్కూల్), సమీరా(జడ్పీస్కూల్, నల్లపాడు) తదితరులు ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ షేక్ గౌసుల్‌మీరా తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సిద్దిక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కన్నా జన్మదిన వేడుకలు



కన్నా జన్మదిన వేడుకల్లో పాల్గొన్న గల్లా మాధవి తదితరులు

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొన్నారు. ఆయన నివాసంలో మంగళవారం జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్ని ఆయనకు మొక్కను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే కన్నాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న తులసీ ధర్మచరణ్

● గుంటూరు, ఆగస్టు 13: వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ మంగళవారం మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కన్నావారి తోటలోని కార్యాలయంలో ధర్మచరణ్ ప్రత్యేకంగా కలుసుకొని శాలువా, పుష్పగుచ్ఛంతో కన్నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన కన్నా జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కన్నా అభిమానులు ఉన్నారు.

● మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం కన్నావారితోటలోని స్వగృహంలో ఘనంగా జరిగాయి. బండి శివరామప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 70కేజీల కేక్ ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య, తాళ్ల వెంకటేష్ యాదవ్, ఉయ్యాల శ్యామ్ వరప్రసాద్, పాలేటి మాధవ, నీలం ప్రసాద్, పాలిశెట్టి రఘు, ఎస్ఎమ్ నిజాముద్దీన్, ఎస్టీ నాయకులు అమాష్ రాములు, బిజెపి నేతలు పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, బబ్బూరి శ్రీరామ్, నోముల చలపతిరావు, పలువురు జనసేన నాయకులు ఎమ్మెల్యే కన్నాకు పుష్పగుచ్ఛంతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13: శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లో బడి, గుడి, విద్య, ఉపాధితో పాటు అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అని నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీనగర్‌లోని మాతృశ్రీ వృద్ధుల ఆశ్రమంలో టీడీపీ నాయకుడు కొర్రపాటి సురేష్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాలు, మేడిద బాబురావు, అడపా మోహన్ మాదిగ, ఈమని చిట్టిబాబు, తిరువీధుల శంకర్ ప్రసాద్, టైగర్ ప్రసాద్, మల్లాల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), ఆగస్టు 13 : మాజీ మంత్రి, సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు కన్నా నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో తేళ్ల రంగారావు, కోరారు సదాశివరావు, కంభం పెదబాబు, చన్నముల్లు నాగేశ్వరరావు, నెలకుదిటి వెంకటేశ్వర్లు, చిరుమామిళ్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



కన్నాకు శుభాకాంక్షలు తెలుపుతున్న తేళ్ల రంగారావు, కోరారు సదాశివరావు తదితరులు



క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నూతనంగా ఎన్నికైన కమిటీ

క్రెడాయ్ గుంటూరు చాప్టర్ చైర్మన్‌గా సతీష్‌రెడ్డి

● ప్రెసిడెంట్‌గా మామిడి రాము ఏకగ్రీవంగా ఎన్నిక

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 13 : క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ మేరకు ఎన్నికల కమిటీ సభ్యులు ఆళ్ల శివారెడ్డి, మాజేటి ప్రసాద్, వంగ జగన్మోహన్ రెడ్డి లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024-25కిగాను ఈ నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ చైర్మన్‌గా ఆరుమళ్ళ సతీష్‌రెడ్డి, ప్రెసిడెంట్‌గా మామిడి రాము, వైస్ ప్రెసిడెంట్‌గా తియ్యగూర వినోద్‌రెడ్డి, వల్లపు శివనాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా మెట్టు సాంబశివరెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా మద్ది వెంకట నాగ కార్తీక్, వట్టికూటి రమాకాంత్, అన్నపురెడ్డి భరత్‌రెడ్డి, ట్రెజరర్‌గా ఆళ్ల వెంకట నాగార్జునరెడ్డి, ఈసీ సభ్యులుగా జి.వెంకటరెడ్డి, పి.సాహిత్, వై.పవన్ కుమార్, జి.శివ నాగబాబు, మెట్టు వెంకటరెడ్డి, పి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.కళ్యాణ చక్రవర్తి, బడే సుబ్బారెడ్డి, శంకర రాజగోపాల్ తదితరులను ఎన్నుకున్నట్లు ఆళ్ల శివారెడ్డి పేర్కొన్నారు.

17న అరుణాచలంనకు మూడు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, ఆగస్టు 13: ఈనెల 19న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 17న రాత్రి 9.15 , 9.30, 9.45 గంటలకు బయల్దేరి 18వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 19న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 20వ తేదీన ఉదయం 6.30 , 6. 45, 7 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటాయన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జీ రూ. 2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

15న జాతీయ కళాశ్రీ పురస్కారాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 15 : స్థానిక బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య కళావేదికపై స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న కళాంజలి క్రియేషన్స్ నిర్వహణలో 2024 శ్రీ టీవీ కళాశ్రీ పురస్కారాల ప్రదానం జరుగుతుందని రంగస్థల, సినీ నటుడు చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. శ్రీ పద్మావతి కల్యాణవేదికలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్యతో కలిసి ఆయన ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు పురస్కారాలు, ప్రజాకళాకారులు రంగం రాజేష్ చే దేశభక్తి గీతాల సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చెస్ పోటీల్లో విజేతలకు అభినందనలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13 : నరసరావుపేట ఎంఈఎం బీ ఫార్మసీ కళాశాలలో ఈ నెల 11న జరిగిన చెస్ పోటీలలో చెస్ ఈజ్ లైవ్ రూక్ రైడర్స్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచారు. అండర్-11 విభాగంలో ఏ.ఆనంది రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా, అండర్-13లో ఎం. మనస్విని 3వ స్థానం, అండర్-7 లో పి.గగన్ 5వ స్థానం, అండర్-9లో ఎం.చేతన్, బి.నవిత్‌లు ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. క్రీడాకారులను చెస్ కోచ్ రాంబాబు, అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యా సంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు



పాఠశాల బస్సులను తనిఖీ చేస్తున్నట్టు ఆర్టీవో గోపాల్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13 : నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న విద్యాసంస్థల బస్సులపై మంగళవారం రవాణ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఇందులో ఫిట్ నెస్ లేక తిరుగుతున్న బస్సుపై 1, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై 2, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తిరుగుతున్న బస్సులపై 5, పన్ను చెల్లించని బస్సులపై 4, పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించినందుకు 26, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించినందుకు 15, మొత్తం 53 కేసులు నమోదు చేశారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీటీసీ కరీం తెలిపారు.

ప్రజా సమస్యలు ప్రస్తావించకపోవటం విచారకరం

గుంటూరు, ఆగస్టు 13: పార్లమెంటు సమావేశ మందిరాల్లో ప్రజా సమస్యలపై ప్రస్తావించకపోవటం విచారకరమని రాజకీయ విశ్లేషకులు ఇ.చంద్రయ్య విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామి రెడ్డి, ప్రజాచైతన్య వాణి కన్వీనర్ వీవీ రావ్, చంద్రశేఖర్, గుప్తా ఉన్నారు.

అందరి మన్ననలను పొందిన హరికృష్ణ : కావటి

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 13 : గుంటూరు నగర ఇన్‌చార్జి కమిషనర్‌గా అనతికాలంలోనే అందరి మన్ననలను హరికృష్ణ పొందారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. నగర కమిషనర్(ఎఫ్‌ఏసి)గా రిలీవ్ అవుతున్న ఎస్.హరికృష్ణ అభినందన సభ మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర ఇన్‌చార్జి కమిషనర్‌గా 14 రోజుల అనతి కాలంలోనే ఎస్.హరికృష్ణ నగర ప్రజల, అధికారుల మన్ననలను పొందారన్నారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు కమిషనర్ హరికృష్ణని పూల బొకేలు, శాలువాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజిలా, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇన్‌చార్జి కమిషనర్ సూర్యదేవర హరికృష్ణ సత్కరిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు, అధికారులు

సౌర విద్యుత్ వినియోగంతో ఆదాయం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 13 : సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణహితంతో పాటు, ఖర్చులు కూడా తగ్గించుకొని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని గుంటూరు నగర ఇన్‌చార్జి కమిషనర్ సూర్యదేవర హరికృష్ణ తెలిపారు. సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పై ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ని నగర పాలక సంస్థ ఈఈ కొండారెడ్డి, డిఈఈ శ్రీధర్ లతో కలిసి మంగళవారం కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో యునిడో సహకారంతో 2 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుమారు రూ.4.75 కోట్లతో 500 కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ రోజుకి సరాసరి 2వేల యూనిట్ల విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తుందన్నారు. జాగర్లమూడి నుంచి గుంటూరుకి తాగునీరు సరఫరా చేసే మోటార్ల రన్నింగ్ కోసం రోజుకి 650 నుంచి 1300 యూనిట్లను వినియోగించుకొని మిగిలిన యూనిట్లను గ్రిడ్‌కు అమ్మడం జరుగుతుందన్నారు.

మహాభారతం అరణ్యపర్వం ప్రవచనం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 13: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం మహాభారతంలోని అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రవచిస్తూ సభాపర్వంలో భంగపడిన పాండవులు జూద నియమానుసారం పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం చేయడం ఈ పర్వంలో ముఖ్య కథాంశమన్నారు.

మత్తు, హింసపై ఐక్యంగా ఉద్యమించాలి : రమాదేవి

గుంటూరు(తూర్పు),ఆగస్టు 13 : క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో యువత క్విట్ డ్రగ్స్, లిక్కర్, హింస విడనాడాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. కిట్స్ అక్షర, మలినేని ఇంజనీరింగ్ కళాశాల్లో డ్రగ్స్, మద్యం, హింసకు వ్యతిరేఖంగా మంగళవారం సదస్సులు జరిగాయి. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ మత్తు పదార్థాలను అరికట్టడంలో అందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేరళలో వరద బాధితులను ఆదుకోవాలి : లింగంశెట్టి

గుంటూరు, ఆగస్టు 13: కేరళలో విలయంతో కొట్టుమిట్టాడుతోన్న ప్రజల్ని కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు కోరారు. కేరళలోని వాయనాడ్ వరదల్లో సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) పిలుపు మేరకు గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ కరీం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం మంగళవారం హిందూ కళాశాల వద్ద జరిగింది. కార్యక్రమంలో హోప్ విన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ షమా సుల్తానా, గుంటూరు కోవిడ్ ఫైటర్స్ ప్రతినిధులు అల్లా బక్షు, డీసీసీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు సుధీర్ బాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కట్టా జవహర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, కాకాని యనమదల, కావూరి నాగేశ్వరరావు, తిరుమలరావు, సుమంత్, మదన్, మీరావలి, ఏసు, షారుక్, సాదిక్, మీరావలి తదితరులున్నారు.

16 నుంచి పోలేరమ్మ తల్లి పొంగళ్ళ మహోత్సవాలు

గుంటూరు, ఆగస్టు 13: చుట్టుగుంట వద్ద ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి పొంగళ్ళ మహోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పొంగళ్ళ, జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



రోడ్డుపై మురుగునీరు పారడాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

అధికారుల తీరు మారకపోతే ఎలా?

● మురుగునీటి నిర్వహణపై ఎమ్మెల్యే గల్లా మాధవి అసహనం

గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో మురుగునీటి నిర్వహణపై అధికారుల తీరు మారకపోతే ఎలా అంటూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు 25వ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీ, జోసఫ్ నగర్, పట్టంశెట్టి వెంకటేశ్వరావు కాలనీ, గాంధీ నగర్, పోలీస్ కాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు. జోసఫ్ కాలనీలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయని ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. జోసఫ్ నగర్‌లో నిరుపయోగంగా ఉన్న 'ది సిటిజన్ రిసోర్స్ సెంటర్‌కు మరమ్మతులు చేయించి ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించాలని గల్లా మాధవి అధికారులను ఆదేశించారు. కాలనీలో వర్షపు నీరు నిలిచి, చెరువును తలపిస్తున్న ప్రాంతాన్ని ఆమె గమనించి ఆగ్రహం వ్యక్తం చేసారు. సమస్య అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ కాలనీలో 10 సంవత్సరాల నుంచి రోడ్డు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేయగా, రోడ్డు నిర్మాణం కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్, రాజు (బీజేపీ), చెంబేటి మణికుమారి, వేముల శ్రీను, వేణు, పవన్, అజిత్, దానియేలు, కోటయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే గల్లా మాధవి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుని ఎమ్మెల్యే గల్లా మాధవి, టీడీపీ నాయకుడు గల్లా రామచంద్రరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

అరవై రోజులలో 60కి పైగా హామీలు అమలు : మన్నవ



గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 60 రోజుల్లో 60కి పైగా హామీలు అమలు జరిగాయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ రెడ్డి తాను అధికారంలో లేకపోవడం వల్లే పథకాలు ఆగిపోతున్నాయని నిస్సిగ్గు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. నాడు 60 రోజుల్లో జగన్ ఏమీ చేయలేకపోయాడని, కూటమి ప్రభుత్వం 60కి పైగా పథకాలు అమలు చేసిందని అన్నారు. నాడు జగన్ పాలనలో నియంతృత్వం రాజ్యమేలగా, నేడు కూటమి పాలనలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని, ప్రజలు సంతోషంగా వున్నారని ఆయన చెప్పారు.

బీసీ వాదం ఇప్పుడు గుర్తుకువచ్చిందా? : వేములకొండ



గుంటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలు పనులు చేసిన జోగి రమేశ్‌కు ఇప్పుడు బీసీ వాదం గుర్తుకు వచ్చిందా అంటూ టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. చిన్నారి అమర్నాథ్‌గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టిన రోజు అగ్ర కులస్తులు, జగన్ కులస్తులను జోగి ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆనాడు చంద్రబాబు ఇంటిపై దాడికి ప్రయత్నించి బీసీల పరువు, ముఖ్యంగా గౌడ సామాజికవర్గ పరువు తీసిన జోగి నేడు కులం కార్డు అడ్డుపెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారంలో వున్న ఐదేళ్లు బీసీలకు, కనీసం సొంత సామాజిక వర్గానికి జోగి రమేశ్ చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

విజ్ఞాన్ నిరులాలో 'అమ్మపేరిటి ఒక మొక్క'



మొక్కలు నాటుతున్న పీబీసీ అధికారి రమేశ్‌చంద్ర తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 13 : స్థానిక పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అమ్మపేరిటి ఒక మొక్క నాటే కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు మొక్కలు నాటారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిసిబి అధికారి ఆర్ రమేశ్‌చంద్ర వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక, ఎన్‌సీసీ అధికారి జ్యోతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు (కార్పొ రేషన్), ఆగస్టు 13 : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2024 పోటీలను ఈనెల 3,4 తేదీలలో తాడిపత్రిలో నిర్వ హించగా పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ విద్యార్థిని లు సత్తా చాటారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.హర్షవర్థిని స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా 6వ తరగతి చదువుతున్న బి.రమ్యశ్రీ స్వర్ణ పతకం సాధించింది. బాలికలను పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, కోచ్ బి.కాశీనాథ్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి ,ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతి దేవి, కోఆర్డినేటర్స్ శ్రీ దుర్గా శ్యామ్, శ్రీదేవి, కోచ్‌లు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న పాటిబండ్ల విష్ణువర్ధన్, అధ్యాపకులు

యూబీఐతో మదుపరులకు చక్కని అవకాశం

గుంటూరు, ఆగస్టు 13: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తపేట శాఖ వారి ఆధ్వర్యంలో సమ్ వృద్ధి పథకంలో భాగంగా కోటి రూపాయల విలువ కలిగిన ఖాతాలను తెరిచినట్లు బ్యాంక్ రీజనల్ హెడ్ సయ్యద్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పొదుపుదారులకు డిపాజిట్ పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ పథకంలో ఖాతాదారులు 333 రోజులు బ్యాంకులో పొదుపు చేసిన వారికి అత్యధిక వడ్డీ రేటు (సీనియర్ సిటిజన్‌లకు 8.15శాతం) బ్యాంకు అందిస్తుందన్నారు.

విజేతలకు ప్రశంసలు

గుంటూరు(విద్య), ఆగస్టు 13 : ఇటీవల జిల్లా ఎయిడ్స్, టీబీ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్, పరుగుపందెం పోటీల్లో టిజెపియస్ విద్యార్థులు సి చేతన, ఎస్‌కె పర్వీన్‌ల ప్రథమ,ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులను కార్యదర్శి కెవి బ్రహ్మం, ప్రిన్సిపల్ ఎబిపి మనోహర్ పిజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనితలు మంగళవారం ఏర్పాటు చేసి కార్యక్రమంలో అభినందించారు.

నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 14 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



సక్సెస్‌ను సెలబ్రేట్ చేద్దాం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ "సరిపోదా... చిత్రంతో ప్రేక్షకులకు మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. మన సినిమా సక్సెస్‌ను థియేటర్లలో సెలబ్రేట్ చేద్దాం' అన్నారు. ఎస్. జే సూర్య మాట్లాడుతూ 'నాని గారి పాత్ర ఈ సినిమాలో ప్రతి శనివారం చేసే పనులు 'బాషా' చిత్రాన్ని గుర్తుకు తెస్తాయి' అన్నారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని డీవీవీ దానయ్య చెప్పారు.

కొత్తగా...

ధైర్యాన్ని నింపింది



నటుడిగా తొలి చిత్రం 'అలనాటి రామచంద్రుడు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో నడుస్తోంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మీడియాతో ముచ్చటించారు. "నా తొలి సినిమాకే ఇంతటి ప్రేక్షకాదరణ దక్కడం చాలా సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఓ స్వచ్ఛమైన ప్రేమకథను థియేటర్లలో చూశామని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ విజయం టీమ్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది" అని చెప్పారు.

ఐదు జంటల ప్రేమకథ



ఎం.ఎస్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఈనెల 29న విడుదలవుతోంది. హీరో ఆకాశ్ జగన్నాథ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఐదు ప్రేమ జంటల మధ్య సాగే అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు చెప్పారు. శృతి శంకర్, విహారిక, అభిలాష్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అరమాన్. సినిమాటోగ్రఫీ: ఎస్. ప్రసాద్.

షారూఖ్‌ను దాటిన పాపులారిటీ



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా విడుదల చేసిన ఈ వారం అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సెలబ్రిటీ జాబితాలో హీరోయిన్ శోభితా దూళిపాళ్ల పలువురు అగ్ర తారలను వెనక్కునెట్టి, రెండో స్థానం దక్కించుకున్నారు. షారూఖ్‌ఖాన్ ఆమె తర్వాతి స్థానంలో నిలిచారు. శార్వరీ అగ్రస్థానంలో నిలవగా, జాన్వీకపూర్ ఐదో స్థానంలో నిలిచారు. ఇటీవలే నాగచైతన్యతో శోభిత నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో నెటిజన్లు ఆమె గురించి తెలుసుకునేందుకు ఎక్కువగా సెర్చ్ చేశారు.

'మిస్టర్ బచ్చన్'ను గుర్తుంచుకుంటారు



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీరు కొత్త రవితేజను చూస్తారు. ఇందులోని ప్రేమకథ, పాటలు, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో ఇరగదీస్తుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇది థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించే సినిమా. అనుకున్నదానికంటే బాగా వచ్చింది. దానిక్కారణం ఆయనంక బోస్ విజువల్స్, మిక్కీ.జే.మేయర్ సంగీతం. ఈ సినిమాకు రిపీట్ ఆడియెన్స్ ఉంటారు" అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. "ఇది రవితేజతో నా మూడో సినిమా. ఈ సినిమాలో ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుంది" అని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు.



తిరుమలేశుడి సేవలో జాన్వీకపూర్

ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ యాక్టర్ జాన్వీ కపూర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె తన స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీదేవి జీవించి ఉండగా ఏటా తన పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేవారు. జాన్వీకపూర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

గురుదక్షిణగా రూ. 300



ఖరీదైన బహుమతులే అవ్వాల్సిన పనిలేదు... మనసు అంతరాళలో నుంచి పొంగిపొర్లే ప్రేమను వ్యక్త పరిచేందుకు ఇచ్చే బహుమతులు చిన్నవే అయినా వాటి విలువ అమూల్యమే. సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ తను గురువుగా భావించే మహేశ్‌భట్‌కు కూడా ఇలాంటి బహుమతినే అందించి, ఆశ్చర్యపరిచారు. ఇటీవలే ముంబైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మహేశ్‌భట్, అనుపమ్‌ఖేర్ వేదికను పంచుకున్నారు. తన సినీ ప్రయాణం గురించి వేదికపైన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు అనుపమ్‌ఖేర్. 'ఎవరైనా నా బయోపిక్ తీస్తే అందులో భట్ సాబ్‌ది ముఖ్యమైన పాత్ర అవుతుంద'ని ఆయన అన్నారు. అలా చెబుతూ వెంటనే తన జేబులో నుంచి రూ. 300 తీసి మహేశ్‌భట్‌కు అందజేసి, గురుదక్షిణగా స్వీకరించాలని కోరారు. మహేశ్‌భట్ ఆ నోట్లను సంతోషంగా స్వీకరించడమే గాకుండా వాటిని వేదికపైనుంచి అందరికీ చూపించి, జాగ్రత్తగా తన జేబులో దాచుకున్నారు. అనుపమ్‌ఖేర్ సినీ జీవితాన్ని మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్'. నటుడిగా ఆయనకు గొప్ప పేరు తెచ్చి కెరీర్‌లో నిలదొక్కుకునేలా చేసింది. 1984లో వచ్చిన ఈ చిత్రానికి మహేశ్‌భట్ దర్శకత్వం వహించారు.

సవాలుతో కూడుకున్న విషయం



తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న తమిళ సంగీత దర్శకుల్లో జి.వి.ప్రకాశ్ ఒకరు. ఆయన సంగీతం అందించిన లేటెస్ట్ చిత్రం 'తంగలాన్'. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇలాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కు సంగీతం అందించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలకు పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ చాన్స్ మిస్ చేసుకోవాలనుకోలేదు. ఒక సంగీత దర్శకుడిగా ఈ సినిమాకు పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సినిమాకు ఎలాంటి సంగీతం అందించాలనే విషయమ్మై చాలా పరిశోధన చేశాను. దర్శకుడు పా.రంజిత్ విజన్ చాలా బాగుంటుంది. థియేటర్లలో పూనకాలు తెప్పించే సన్నివేశాలు సినిమాలో చాలా ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన పాటలకి మంచి స్పందన వస్తోంది" అని చెప్పారు.

డేట్ మార్చడమే 'స్త్రీ 2'కి కలిసొచ్చిందా?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం రెండు హిందీ చిత్రాలు విడుదలవుతున్నాయి. అవేమిటంటే.. అక్షయ్‌కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే', జాన్ అబ్రహం ప్రధాన పాత్ర పోషించిన 'వేదా'. వీటి కంటే ఒక రోజు ముందే రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ 2' రిలీజ్ అవుతోంది. ఈ మూడు చిత్రాల్లో మొదటి నుంచీ 'స్త్రీ 2' చిత్రం మీద ఎవరికీ అంచనాలు లేవు. దీనికి ప్రధాన కారణం హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు నాలుగేళ్లుగా సరైన హిట్ లేకపోవడం. అలాగే హీరో రాజ్‌కుమార్ రావుకు ఈ ఏడాది విడుదలవుతున్న మూడో సినిమా ఇది. అతనికి కూడా ఓహో అనిపించే హిట్ పడకపోవడం మరో కారణం. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ' చిత్రం 2018లో విడుదలై సూపర్ హిట్ అయింది. అప్పట్లోనే ఈ హారర్ కామెడీ రూ వంద కోట్లు వసూలు చేసింది. సాధారణంగా సీక్వెల్ అనగానే భారీ అంచనాలు ఉండడం సహజం. కానీ 'స్త్రీ' సీక్వెల్‌కు అంత క్రేజ్ రాకపోవడం గమనార్హం. మొదట ఈ సినిమాను కూడా గురువారమే విడుదల చేయాలనుకున్నారు. అప్పటికే రెండు భారీ చిత్రాలు పోటీలో ఉండడంతో భారీ ఓపెనింగ్స్ వస్తే గొప్పే అని అనుకున్నారు .కానీ అనూహ్యంగా గురువారం కు బదులు బుధవారమే సినిమాను విడుదల చేయాలని చివరి క్షణంలో నిర్ణయం తీసుకోవడం "స్త్రీ 2' కు కలసి వచ్చిందని ట్రేడ్ పండితులు అంటున్నారు. సోలో రిలీజ్ కావడంతో మొదటి రోజే రూ పది కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని ఓ అంచనా.



టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ జోరు చూస్తుంటే అంత మొత్తం వసూలు చేయడం ఈజీయే అని ట్రేడ్ పండితులు పేర్కొంటున్నారు. చిన్న చిత్రాల్లో 'గదర్ 2' చిత్రానిదే ఇప్పటివరకూ రికార్డ్. ఆ సినిమా తొలి వారం రూ 40.10 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడున్న అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్‌ను పరిశీలిస్తే 'స్త్రీ 2' దానిని అధిగమించి, రూ 50 కోట్లు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ 'స్త్రీ 2' చిత్రానికి సంబంధించి 2.21 లక్షల టికెట్లు అడ్వాన్స్‌గా బుక్ అయ్యాయి. దీని వల్ల రూ. 6.87 కోట్లు వసూలు అయ్యాయి. మహారాష్ట్ర, ఢిల్లీ సర్క్యూట్స్ లోనే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. ఓపెనింగ్ రోజు థియేటర్ల దగ్గర అమ్మకాలు ఉంటాయి కనుక రూ పది కోట్లు వసూలు చయడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. అదే నిజమై 'స్త్రీ 2' తొలి వారం రూ 50 కోట్లు వసూలు చేస్తే హారర్ కామెడీ చిత్రాల్లో ఇదే హయ్యెస్ట్ రికార్డ్ అవుతుంది. ఈ అంకెలు ఎంతవరకూ నిజమవుతాయో కొన్ని గంటల్లో తేలిపోతుంది కనుక వేచి చూద్దాం.



ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ: ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంసీఏ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ☆ **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- ☆ **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- ☆ **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
- ☆ **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- ☆ **వెబ్‌సైట్:** audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8tClgiXలో చదవండి.

దిక్సూచి

మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్ల స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org





అన్న క్యాంటీన్ పనులను త్వరతగతిన పూర్తిచేయండి
● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న


అన్న క్యాంటీన్ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 13: పట్టణంలో జరుగుతున్న అన్న క్యాంటీన్‌ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఆదేశించారు. స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులోని అన్న క్యాంటీన్ పనులను మంగళవారం పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలోని మూడు అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. పేదలకు, నిత్య కూలీలకు, చిరువ్యాపారులకు అతి తక్కువ ధరలకే నాణ్యమైన ఆహారం అందించడానికి అన్న క్యాంటీన్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జాతీయ జెండాలను అవిష్కరిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు, రఘురాం తదితరులు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి
● పోస్టల్ సూపరిండెంటు కరుణాకర్‌బాబు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 13: తెనాలి డివిజన్‌లో స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని పోస్టల్ సూపరింటెండెంటు కరుణాకర్ బాబు అన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని నటరాజ్ జ్యూయలరీ మార్ట్‌లో మంగళవారం జాతీయ జెండాల అమ్మకాలను పోస్టల్ సూపరింటెండెంటు జి కరుణాకర్ బాబు ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోస్టల్ సంస్థ జాతీయ జెండాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్, కొత్తమాసు రఘురాం, పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి
● జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ

తెనాలి, మారీసుపేట ఆగస్టు 13: యువత పెడత్రోవపట్టి మత్తు పదార్థాలకు బానిసలవ్వద్దని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీ అన్నారు. స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో మంగళవారం నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నషాముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తమ దేశభక్తిని చాటుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థినులు, అధ్యాపకులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, కళాశాల డీన్స్ డాక్టర్ ఉమామహేశ్వరావు, డాక్టర్ సుధాకరయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ ఉషారాణి, ఏవోలు, తదితరులు

పంటకోత ప్రయోగంపై శిక్షణ

తెనాలి రూరల్, ఆగస్టు 13: తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని వీఏఏ, వీహెచ్‌ఏ, ఎంపీఈవోస్, ఏఈవోస్‌కు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద నిర్వహించే పంట కోత ప్రయోగాలపై పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పొదుపు భవన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ ఉషారాణి, తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న లెఫ్ట్ హ్యాండర్స్ విద్యార్థులు, హెచ్ఎం తదితరులు

జడ్పీహెచ్ స్కూల్‌లో లెఫ్ట్ హ్యాండర్స్‌డే వేడుకలు

తెనాలి రూరల్, ఆగస్టు 13: మండలంలోని పెదరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో లెఫ్ట్ హ్యాండర్స్ డే (ఎడమచేతి వాటం)ను ఘనంగా నిర్వహించారు. హైస్కూల్‌లో మొత్తం 420మంది విద్యార్థులకు గానూ 24మంది ఎడమచేతితో రాసే విద్యార్థులున్నారు. లెఫ్ట్ హ్యాండర్స్‌డేను పురస్కరించుకుని స్కూల్ హెచ్ఎం సరళ, ఇతర ఉపాధ్యాయులు కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపి బహుమతులు అందించారు. లెఫ్ట్ హ్యాండర్స్ డే విశిష్టతను వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులు, స్కూల్ అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది కిషోర్

మానసిక దివ్యాంగులకు ఉచిత న్యాయ సాయం

తెనాలి అర్బన్, ఆగస్టు 13: మానసిక దివ్యాంగులకు ఉచిత న్యాయ సాయం అందుబాటులో ఉందని ప్యానల్ న్యాయవాది అప్పల కిషోర్ తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాలాజీరావుపేట భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వికలాంగులకు ఉన్న హక్కులు, పథకాలను వివరించారు. వికలాంగులకు ప్రభుత్వం అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఎంఈవో జయంత్‌బాబు, అనీల్‌కుమార్, సునీత, రజని పాల్గొన్నారు.

జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయండి
● కలెక్టర్ నాగలక్ష్మి


జగనన్న కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

తెనాలి రూరల్, ఆగస్టు 13: జగనన్న కాలనీలో పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని జిల్లా పాలనాధికారి (కలెక్టర్) నాగలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని మునిసిపల్ డంపింగ్‌యార్డు, పెదరావూరులోని జగనన్న కాలనీలను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో నిర్వహిస్తున్న వర్మి కంపోస్ట్ విధానాన్ని పరిశీలించడంతో పాటు యార్డు చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలపై కమిషనర్ శేషన్నను ప్రశ్నించారు. వ్యర్థాలతో పూర్తిగా డంపింగ్ యార్డు నిండిపోయిందని దానిని మరో ప్రాంతానికి ఎందుకు తరలించడంలేదని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ నిధుల కొరతని బదులిచ్చారు. 15 ఫైనాన్స్ నిధులు వినియోగించుకోవచ్చుకదా అని కలెక్టర్ కమిషనర్‌కు సూచించగా అవి చాలడంలేదని బదులిచ్చారు. అనంతరం పెదరావూరు జగనన్న కాలనీలను సందర్శించారు. అక్కడ ఇచ్చిన పట్టాలు, ఇప్పటికే పూర్తిగా నిర్మించుకున్న ఇళ్లు, కట్టుబడిలో ఉన్న ఇళ్లు, అసలు పనులు ప్రారంభించని స్థలాల వివరాలను హౌసింగ్ ఇతర శాఖల అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా నివసిస్తున్న పలువురు కలెక్టర్‌ను కలిశారు. వర్షం కురిస్తే తాము కాలనీలో నుంచి బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కనీసం తాగునీరు కూడా దొరకని పరిస్థితి ఇక్కడ ఉందన్నారు. మరికొందరు ప్రతి నెలా 1వ తారీకున ఇచ్చే పింఛన్ కూడా ఇంటివద్దకు వచ్చి ఇవ్వడంలేదని, రేషన్ సరుకుల వ్యాను కూడా తమ ప్రాంతాలకు రావడంలేదని విన్నవించారు. కాలనీ నుంచి పట్టణానికి వెళ్లి రావటానికి రూ.100 ఖర్చవుతోందని, త్వరితగతిన తమకు రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ మంచి జరిగేలా ప్రణాళికతో ముందుకు నడుస్తుందన్నారు. డిసెంబరు 31 నాటికి పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలు పూర్తిచేసేలా కార్యాచరణతో ముందుకు వెళుతున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు కాంట్రాక్ట్ తీసుకున్న కాంట్రాక్టర్లతో నాణ్యతా ప్రమాణాలు కూడిన మెటీరియల్‌తో వాటి పనులను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించేలా ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. కాలనీలో ఉంటున్న సుమారు 100కుటుంబాల వారికి పింఛన్, రేషన్ సరుకులు వారి ఇంటి వద్దకే వచ్చి అందించేలా కమిషనర్‌కు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే మౌలిక వసతులు కూడా కల్పిస్తామని ధైర్యంగా ఉండాలని ఆమె వారికి భరోసా నిచ్చారు. అసిస్టెంట్ కలెక్టర్ పవర్‌స్వప్నిల్ జగనాథ్, సబ్‌కలెక్టర్ ప్రకర్‌జైన్, స్పెషల్ ఆఫీసర్ గాయత్రిదేవి, మునిసిపల్ కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, హౌసింగ్ ఈఈ భాస్కరరావు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్

తెనాలి, మారీసుపేట ఆగస్టు 14: మున్సిపల్ అధికారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు మంగళవారం మున్సిపల్ కార్యాలయ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, ప్రతి రోజు మంచినీటి పరీక్షలును నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ రెవెన్యూ పెంచాలని అన్నారు. పురపాలక సంఘ వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అసిస్టెంటు కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాధ, మున్సిపల్ కమీషనర్ బి శేషన్న, పురపాలక సంఘ ప్రత్యేక అధికారి గాయత్రీదేవి, అసిస్టెంటు కమిషనర్ అనూష, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అసిస్టెంటు కలెక్టర్ పవర్ స్వప్నిల్, కమిషనర్ శేషన్న తదితరులు

18న జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

తెనాలి అర్బన్, ఆగస్టు 13 :జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, రాష్ట్ర పోటీకి సెలక్షన్లు ఈ నెల 18న జరుగుతాయని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ మల్లికార్జునరావు తెలిపారు. తక్కెళ్లపాడు శివాలయ ప్రాంగణంలో నిర్వహించే పోటీలలో ఆసక్తి కలిగిన యువతీ, యువకులు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు కూడా ఎంపికలు నిర్వహిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిహరనాథ్

20 నుంచి ఇంటింటి ఓటర్ల సర్వే

పొన్నూరు టౌన్, ఆగస్టు 13: ఈ నెల 20వ తేదీ నుంచి బూత్ లెవల్ అధికారులు ఓటర్ల నమోదుకు ఇంటింటి సర్వే నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి వై హరిహరనాథ్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ఏఈ ఆర్వోలు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం జరిగింది. హరిహరనాథ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం, షెడ్యూల్ ప్రకారం బీఎల్వోలు తప్పకుండా విధులు నిర్వర్తించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం క్లయిములు పరిష్కరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి బీఎల్వో తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ఓటర్లను సంప్రదించి వివరాలు సేకరించాలన్నారు. క్లయిముల పరిష్కార విషయంలో ఎన్నికల సంఘం ఆదేశాలు పాటించాలన్నారు. ప్రతి బుధవారం ఈ క్లయిములకు సంబంధించి సమీక్ష సమావేశం జరపనునట్లు చెప్పారు. 2025 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్ల నిండే ప్రతి ఒక్కరు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆర్వోలు పి ప్రశాంతి, పి రత్నం, కేఎస్ శర్మ, సీఎంఎ నయాం అహ్మద్, ఫణికుమార్లు తదితరులు హాజరైయ్యారు.

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

పొన్నూరు టౌన్, ఆగస్టు 13: ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21వ తేదీన తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య మంగళవారం కోరారు. ఈ నెల 15వ తేదీన పొన్నూరు పరిసర మండలాల్లో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి పల్లెలో ప్రతి గడపను నిద్రలేపి వర్గీకరణ వల్ల భవిష్యత్తులో జరగబోయే నష్టాన్ని వివరించనునట్లు చెప్పారు. ఈ నెల 21వ తేదీన తలపెట్టిన బంద్‌కు ఆర్టీసీ, పాఠశాలలు, కళాశాలలు, వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


శ్రావణ పట్టీ సమర్పించేందుకు వచ్చిన భక్తులు

అమ్మవారికి శ్రావణ పట్టీ

పెదకాకాని, ఆగస్టు 13: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి శ్రావణపట్టీని భక్తులు మంగళవారం సమర్పించారు. దత్తపీఠం పటమటకు చెందిన భక్తులు మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టీ సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్ రావు దంపతులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ప్రస్తావించకపోవటం విచారకరం

గుంటూరు, ఆగస్టు 13: పార్లమెంటు సమావేశ మందిరాల్లో ప్రజా సమస్యలపై ప్రస్తావించకపోవటం విచారకరమని రాజకీయ విశ్లేషకులు ఇ.చంద్రయ్య విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామి రెడ్డి, ప్రజాచైతన్య వాణి కన్వీనర్ వీవీ రావ్, చంద్రశేఖర్, గుప్తా ఉన్నారు.

విద్యా సంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు

గుంటూరు (తూర్పు), ఆగస్టు 13 : నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న విద్యాసంస్థల బస్సులపై మంగళవారం రవాణ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఫిట్ నెస్ లేక తిరుగుతున్న బస్సుపై 1, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై 2, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తిరుగుతున్న బస్సులపై 5, మొత్తం 53 కేసులు నమోదు చేశారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీటీసీ కరీం తెలిపారు.

అదృశ్యమైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

పొన్నూరు టౌన్, ఆగస్టు 13: పొన్నూరు పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాలుడు సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం అవటంతో బాలుడి తండ్రి కళ్యాణ్ అర్బన్ పోలీసులను ఆశ్రయించారు. బాలుడి అదృశ్యం గురించి తెలుసుకున్న అర్బన్ సీఐ పి.భాస్కర్ సకాలంలో స్పందించి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు తక్షణ సమాచారం అందించారు. తప్పిపోయిన బాలుడు మంగళగిరిలో ఆచూకీలభ్యం కావటంతో బాలుడిని పొన్నూరు రప్పించి పోలీసు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

15న ధ్యానోత్సవం

తెనాలి అర్బన్, ఆగస్టు 13: రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న మూడు రోజుల పాటు నిర్వహించనున్న ధ్యానోత్సవం ప్రారంభం అవుతుందని కో-ఆర్డినేటర్ కృష్ణమూర్తి తెలిపారు. మారీసుపేట కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించే ధ్యానోత్సవంలో మానసిక ఒత్తిడి ఎదుర్కొనేందుకు ధ్యానం ఉపయోగపడే విధానాన్ని వివరించడంతో పాటు ధ్యానం ఎలా చేయాలో నేర్పుతామన్నారు. 15ఏళ్లు పైబడిన వారంతా ఆహ్వానితులేనని ఉదయం 6గంటలకు అక్కడకు చేరుకుని ధ్యానోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.


దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వివేకా పాఠశాలలో దంత వైద్య శిబిరం

తెనాలి అర్బన్, ఆగస్టు 13: నాజరుపేటలోని వివేకా పబ్లిక్ స్కూల్, ఫాస్టర్ స్కూల్‌లో మంగళవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ షహనాజ్, డాక్టర్ సల్మా 500 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, రామరాజు, రాధాకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో ఎఫ్‌డీఆర్ పద్ధతిని అనుసరించండి
● కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణంలో తాజా సాంకేతిక పద్ధతులు వినియోగించాలని, తక్కువ సహజ వనరుల వినియోగంతో స్థానిక భౌతిక పదార్థాలను పునర్వినియోగించే ఫుల్ డెప్త్ రీక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) పద్ధతిని అనుసరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీ క్యాంపస్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. రోడ్లు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో కొత్త సాంకేతికతను అనుసంధానం చేయడంపై ఆయన చర్చించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సమర్థవంతంగా ఉపయోగించి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

హిందూ కళాశాలలో ముగిసిన అంతర కళాశాల పోటీలు

గుంటూరు(విద్య),ఆగస్టు 13: స్థానిక హిందూ కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాల పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. యువజన సంక్షేమ శాఖ, కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 30 కళాశాలల నుంచి 480 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాల పోటీలు, బృందనాట్యం పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, పివి రాము, పూర్వ విద్యార్థి పి.అనిల్‌కుమార్, ప్రిన్సిపల్ పీఎం దుర్గాప్రసాద్, స్టెప్ అధికారులు రాధిక, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి రామచంద్రరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి వేణుగోపాల్, డాక్టర్ కె.కాళిదాస్, డాక్టర్ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలు వీరే

గుంటూరు(విద్య), ఆగస్టు 13: జీవ వైవిధ్య సంరక్షణలో యువత పాత్ర అనే అం శంపై ఆంధ్రప్రదేశ్ బయో డైవర్శిటీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. పాత బస్టాండు సమీపంలోని పరీక్షాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఈవో పి.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. వ్యాసరచనలో లిఖిత(జడ్పీ స్కూల్ అంకిరెడ్డిపాలెం), తులసీ(నారాకోడూరు), రిషిత(కంతేరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా డ్రాయింగ్ పోటీల్లో ఆఫ్తాబ్ అలీ(ఎస్‌కేబీపీఎం మున్సిపల్ స్కూల్, వేణుగోపాలనగర్), హాఫీజ్(కొత్తపేట మున్సిపల్ స్కూల్), షాలిని(ఎస్ఎస్ఎస్‌వో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు) తొలి మూడుస్థానాలు కైవసం చేసుకున్నారు. ఇంకా వక్తృత్వ పోటీల్లో ఉమిక(జడ్పీస్కూల్, అబ్బినేనిగుంట వారిపాలెం), కావ్య(పెదపాలెం హైస్కూల్), సమీరా(జడ్పీస్కూల్, నల్లపాడు) తదితరులు ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ షేక్ గౌసుల్‌మీరా తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం సిద్దిక్, ఉపాధ్యాయులు శివశంకర్, అప్పారావు, శాంతిప్రియ, మల్లికార్జునరావు, బాబురావు, గంగాధర్, ధనయ్య తదితరులు పాల్గొన్నారు.


వడ్లమూడి గ్రామాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తదితరులు

వడ్లమూడిలో విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి
● డాక్టర్ విజయలక్ష్మి

చేబ్రోలు, ఆగస్టు 13: వడ్లమూడి గ్రామంలో ప్రబలిన విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం వడ్లమూడి గౌడపాలెం గ్రామాన్ని డాక్టర్ విజయలక్ష్మి సందర్శించారు. విషజ్వరాల పాలైన పలువురు రోగులతో మాట్లాడి జ్వర తీవ్రత గురించి ఆరా తీశారు. గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించాలని ఆదేశించారు. జ్వర లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి వైద్య శిబిరంలో సేవలందించాలని, అలాగే తీవ్ర లక్షణాలున్న వారిని తక్షణమే ఆసుపత్రిలకు తరలించాలని ఆదేశించారు. గ్రామంలో జ్వర పీడితులు తగ్గేంతవరకు శిబిరాన్ని కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

30 మంది జ్వర పీడితుల గుర్తింపు

చేబ్రోలు మండలం వడ్లమూడిలో 2వ రోజు మంగళవారం వైద్య శిబిరం కొనసాగింది. 2వ రోజు 30మంది జ్వర పీడితులు, జ్వర లక్షణాలతో ఉన్నవారు గుర్తించి వైద్యశిబిరానికి తరలించటంతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. గ్రామంలో మలేరియా డిపార్ట్‌మెంట్ అధికారులు ఇంటింటికి వెళ్లి గ్రామస్తులకు మలేరియా, డెంగీ జ్వరాలకు కారణమైన దోమల లార్వాలను గుర్తించే అంశంపై అవగాహన కల్పించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పంచాయతీ అధికారులతో సంప్రదించి గ్రామంలో మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో తీసుకోవలసిన చర్యలపై సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నిల్వ ఉన్న మురుగునీటిలో వ్యాధికారక దోమలు వృద్ధి చెందటం గుర్తించి దోమల నివారణకు ఆయిల్ బాల్స్, మందుల పిచికారి గురించి అవగాహన కల్పించారు. వైద్యాధికారులు శిబిరాన్ని పర్యవేక్షించారు.


సెయింట్ ఆన్స్ పాఠశాల్లో ప్రారంభమైన ఎన్‌సీసీ బ్యాచ్ క్యాడెట్‌లు

సెయింట్ ఆన్స్ పాఠశాల్లో ఎన్‌సీసీ ప్రారంభం

పొన్నూరు టౌన్, ఆగస్టు 13: విద్యార్థుల్లో క్రమ శిక్షణ, దేశభక్తి పెంపొందించటమే ఎన్‌సీసీ లక్ష్యం అని తెనాలి 22ఏ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ జె మంగేష్ అన్నారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల్లో మంగళవారం ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి లెఫ్టినెంట్ కల్నల్ జె మంగేష్ హాజరై మాట్లాడుతూ నేషనల్ క్యాడెట్ కార్ప్స్ అనేది జాతీయ యువజన విభాగం అన్నారు. స్వచ్ఛంద సంస్థగా తెలిపారు. విద్యార్థులలో పాఠశాల స్థాయి నుంచే సైన్యంలో చేరేలా ప్రోత్సహించటం శాంతియుత పరిస్థితులు నెలకొల్పటం యువతకు మెరుగైన శిక్షణను అందించటమే ఎన్‌సీసీ లక్ష్యం అన్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన అభ్యర్థులకు భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో 23వ బెటాలియన్ చీరాల నాయిబ్ సుబేదార్ రికారామ్, ఎంపీ రమేష్, పాఠశాల కరస్పాండెంట్ రిటాఆన్, ప్రిన్సిపల్ లాలీపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఆల్ఫ్రేడ్, 8వ తరగతి ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడిపై అట్రాసిటీ కేసు నమోదు

పొన్నూరు టౌన్, ఆగస్టు 13: వైసీపీ నాయకుడు దాసరి నారాయణరావుపై అర్బన్ పోలీసులు సోమవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. అర్బన్ సీఐ పి.భాస్కర్ కథనం ప్రకారం పాతపొన్నూరుకు చెందిన కొచ్చెర చిన్నజ్యోతి ఈ నెల 10వ తేదీ రాత్రి కసుకర్రు రోడ్డులో భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా దాసరి నారాయణరావు రహదారి మధ్యలో కారుఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై చిన్నజ్యోతి భర్త సుందరరావు ప్రశ్నించగా దాసరి నారాయణరావు దురుసుగా వ్యవహరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ చిన్నజ్యోతి, సుందరరావును దుర్భాషలాడటమే కాకుండా కులంపేరుతో దూషించి దాడికి ప్రయత్నించాడు. దీనిపై చిన్నజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు పర్యవేక్షిస్తున్నారు.

మిడ్ డే మీల్స్ పెండింగ్ బకాయిలు చెల్లించాలి
● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ

పొన్నూరు టౌన్, ఆగస్టు 13: మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ కోరారు. మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం సీఐటీయూ నాయకులు ఎంఈవో శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందచేసారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అతితక్కువ వేతనంతో వెట్టిచాకిరి చేస్తూ జీవనం సాగిస్తునట్లు చెప్పారు. వండిన వంటలకు బిల్లులు రాక, అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు పడుతునట్లు చెప్పారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పడల్లా వేధింపులకు గురవుతున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్‌లు అమలుచేయాలని కోరారు, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ధరలు చెల్లించటంతోపాటు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందచేస్తున్న ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు

వ్యాస రచన పోటీల్లో తులసికి ద్వితీయ స్థానం

చేబ్రోలు, ఆగస్టు 13: జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎంఎస్ఎన్ఎల్ తులసి ద్వితీయ స్థానంలో నిల్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు తెలిపారు. ఏపీ బయోడవర్సిటీ బోర్డు గుంటూరు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సహకారంతో రోల్ ఆఫ్‌యూత్ ఇన్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అంశంపై జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు మంగళవారం గుంటూరులో జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాల 10వ తరగతి విద్యార్థిని తులసి పాల్గొని ద్వితీయ స్థానం సాధించింది. గుంటూరు ఉపవిద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు విజేతలకు సర్టిఫికెట్, బహుమతులు అందచేశారు. ప్రతిభ చూపిన విద్యార్థిని తులసిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.